# యువహృదయం

రామనాథం ఆఫీసుకు వెళ్ళడంతోనే ప్యూన్‌కోసం గంటకొట్టాడు.

జవాబు లేదు.

ప్యూన్ వస్తున్న అలికిడికూడా వినిపించలేదు.

రామనాథం విసుక్కున్నాడు. సీటులోంచి లేచి గది వెలుపలికి వచ్చాడు.

గదికి వెలుపలవున్న మైదానమంతా కలయచూచాడు. ఎవ్వరూ కనపడలేదు. ఏమీ తోచక రామనాథం తిరిగి తన చోటులోకి వెళ్ళి కూర్చున్నాడు.

విసుగుతో ఈసారి కొంచెం గట్టిగా, మొదటిసారికన్నా ఎక్కువసేపు గంటకొట్టాడు. కాని, ఏమీ లాభం లేకపోయింది.

గత్యంతరం లేక ప్యూన్ ధ్యాసవదిలి, ఫైళ్ళల్లో నిమగ్నుడైనాడు.

సిగరెట్లులేక పని కుంటుపడుతున్నది. తెరచిన ఫైళ్ళు తెరచినట్లుగానే ఉండిపోతున్నాయి. పోనీ వెళ్ళి తెచ్చుకుంటే... ఒక గజిటెడ్ ఆఫీసర్ కొట్టుకెళ్ళి సిగరెట్లు తెచ్చుకున్నాడని తెలిస్తే, ఇంకేమైనా మర్యాద దక్కుతుందా? అందులో ఆఫీసుకు దగ్గరగావున్న కొట్టులో తాను సిగరెట్లు తెచ్చుకోవడం ఎవరి కంటనైనా, ఒకరికంట పడక తప్పదు. అప్పుడు తోటి ఉద్యోగస్థులు, తనని ఎంత చులకనగా చూస్తారు. ఇంక గుమాస్తాలు, ప్యూన్‌లసంగతి వేరే అడగనక్కరలేదు.

తనని చూసి ముసిముసినవ్వులు నవ్వుతుంటారు. అప్పుడు తనకు వారి ముసిముసి నవ్వులూ, లేకి చూపులూ భరించడం ఎంతో కష్టమౌతుంది.

దాదాపు పదకొండు గంటలకు, యల్లయ్య అడుగులో అడుగు వేసుకుంటూ, పిల్లిలాగా తన ఆఫీసుగదిలో ప్రవేశించడం రామనాథం గమనించలేదు. నిప్పుపెట్టె, సిగరెట్లపెట్టె తన టేబుల్‌పైన యల్లయ్య పెడుతుండగా అలికిడై, రామనాథం, తల పైకెత్తి చూచాడు. టేబుల్‌పైన గోల్డుఫ్లేక్ సిగరెట్ పెట్టె, చీతాఫైటు నిప్పుపెట్టె కనపడడంతో, అమాంతంగా అతనికోపం చల్లారిపోయింది. తన ఉద్యోగంలో చేరి రెండురోజులే అయినా, తన అభిరుచుల్ని కనిపెట్టి, వాటికి అనుగుణంగా నడుచుకునే ప్యూన్‌నిచూచి, రామనాథం, ఏమీ అనలేక తటపటాయించాడు. "ఇంత ఆలస్యం ఎందుకైంది?" అన్న చూపుమాత్రం, యల్లయ్యకు రామనాథం కళ్ళల్లో ద్యోతకమైంది. రామనాథం సిగరెట్టు ముట్టించి ఒక గుక్క పీల్చేలోపల, యల్లయ్య తన ఆలస్యానికి కారణం చెప్పడం ఆరంభించాడు.

"మా అమ్మాయి ...... 16 ఏళ్ళది ... స్కూలుకు వెడుతున్న పిల్ల ....నిన్న జ్వరంతో ఇంటికి తిరిగి వచ్చింది... జ్వరంఅంటేకాస్తా కూస్తాకాదు... నేనునిన్న ఇంటికి వెళ్ళేసరికి, శరీరం సలసల కాగిపోతున్నది ... ఏదో గొంతు నొప్పికూడా అని చెప్పింది ... వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాను ... డాక్టర్ "డిఫ్థీరియా" అని తేల్చాడు ... ఐసొలేషన్ ఆసుపత్రిలో చేర్చ మన్నాడు ... అదేదో "ప్రమాదకరమైన జబ్బు" అని కూడా చెప్పాడు...ఆ రాత్రికి రాత్రే అమ్మాయిని

ఆసుపత్రిలో చేర్చాము .... రాత్రంతా నిద్ర లేదు...ఇప్పుడు ఆసుపత్రి నించే ఆఫీసుకు వస్తున్నాను ....

"ఇప్పుడు ఆఫీసుకి ఎందుకు వచ్చావు? సెలవు తీసుకోక పోయావా?" అని అడిగాడు రామనాథం ఆతురతగా.

"ఆ సంగతే చెప్పిపోదామని వచ్చాను" అన్నాడు యల్లయ్య కొంచెం సందేహిస్తూ.

"ఒకటి రెండు రోజుల సెలవు కోసం చెప్పి కూడా వెళ్ళాలా?" అని అన్నాడు రామనాథం యథాలాపంగా.

"మీరు ఈ ఆఫీసుకి కొత్తగా వచ్చారు ... చెప్పక పోతే —"

"ఊఁ, చెప్పకపోతే" అర్ధోక్తిలో అందుకున్నాడు రామనాథం.

"చెప్పకపోతే ఏమనుకుంటారోనని..."

"అవును, నేను రాక్షసినికదూ, అనుకోడానికి."

ఆఫీసర్ ధోరణి ఉద్ధృతంగా మారడంతో యల్లయ్య మౌనం వహించాడు. "ఊఁ, ఇంకా వెళ్ళవేం?" అని ప్రశ్నించాడు రామనాథం, తెచ్చిన సిగరెట్టు ప్యాకెట్టుకీ, నిప్పు పెట్టెకీ ఒక రూపాయి పర్సులోంచితీసి, టేబుల్ మీద పెడుతూ. యల్లయ్య రూపాయి తీసుకోనూ లేదు. అక్కడనించి కదలనూ లేదు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అన్నాడు రామనాథం, యల్లయ్య కదలక పోవడం చూచి.

యల్లయ్య ఏమీ జవాబు చెప్పలేదు.

ఏదో అడగదలచి, అడుగలేక, యల్లయ్య బాధ పడుతున్నట్లు తోచింది రామనాథానికి. "ఇంకొక రెండు రోజులు

సెలవు అడగటానికి సంకోచిస్తున్నాడా?'' అనుకున్నాడు రామనాథం.

''సెలవు విషయంలో ఏమాత్రం బెంగపెట్టుకోకు. కావలిస్తే ఇంకొక రెండు రోజులు సెలవుపెట్టు'' అన్నాడు రామనాథం, తన ముందు తెరిచివున్న ఫైలు మీాదికి దృష్టి పోనిస్తూ.

అక్కడికీ యల్లయ్య కదలలేదు.

యల్లయ్య అక్కడినుంచి కదలకపోవడం, సెలవు కోసం కాదని తోచింది రామనాథానికి. ''మరి దేనికోసమై వుంటుంది, డబ్బుకోసం కాదుగదా?'' ''అవును, డబ్బు కోసమే అయివుంటుంది'' అనుకున్నాడు రామనాథం. మనస్సులో ఆ భావం మెదలడంతోనే, పర్సులోంచి ఒక పాతిక రూపాయలుతీసి టేబుల్ మీాద వుంచాడు. పాపం, మనిషి కష్టాల్లో వున్నాడు—పాతిక రూపాయలు సరిపోతాయో, లేవో అన్నసందేహం కూడా కలగక పోలేదు రామనాథానికి—

''ప్రస్తుతానికి ఈ పాతిక రూపాయలు తీసుకెళ్ళు—ఇంకా అవసరమైతే మళ్ళీ ఒకమాటు కనపడు. ఈ మధ్య అమ్మాయికి ఎల్లా వున్నది కబురు చెయ్యి'' అన్నాడు రామనాథం, నేరుగా యల్లయ్య మొహంలోకి కాక, కొంచం ఎడంగా చూస్తూ.

టేబుల్ మీాది డబ్బు తీసుకోవడానికి, యల్లయ్య ఎందుకో జంకుతున్నట్టు స్ఫురించింది రామనాథానికి. డబ్బు తీసుకుంటూ, ''మీా మేలు ఎన్నటికీ మరిచిపోను'' అని అతను గొణుక్కోవడం, రామనాథానికి అస్పష్టంగా విన

పడింది. ఆ తరువాత యల్లయ్య గదిలోంచి ఎప్పుడు వెళ్ళి పోయాడో, రామనాథం గమనించ లేదు.

పట్టాలు తొలిగిపోయిన రైలుకు మల్లే రామనాథం బుర్ర పనిచేయడం మానుకుంది. ఆఫీసు కాగితాలలో తిరిగి తల దూర్చడం అతనికి కష్టసాధ్యంగా తోచింది. శూన్యం లోకి చూస్తూ, ఏదో ఆలోచించడం మొదలుపెట్టాడు. గది గోడల్ని దాటి, ఆలోచనలు, బగ్గీకి కట్టిన జోడు గుర్రాలకి మల్లె పరుగెడుతున్నాయి. బగ్గీ గమ్యస్థానం ఏమిటో తెలి యదు. ఎడ తెరిపి లేకుండా పరుగెత్తడమే తన ఆలోచనల నైజమేమో? వాకిళ్ళూ, ఇళ్ళూ, వీధులూ దాటుతున్నాయి. తను ఎక్కడికి కొట్టుకుపోతున్నట్లు? ఐసొలేషన్ హాస్పటల్‌కి కాదుగదా? ఏమో? తనకీ, ఆ ఆసుపత్రికీ, సంబంధం ఏమిటి? యల్లయ్య కూతురేనా? ఆ అమ్మాయి పేరు ఏమిటో కూడా తనకు తెలియదు. ఆ అమ్మాయికోసం, తన హృదయం ఎందుకు అంత ఆరాటపడడం? అంతటి చిన్న సంఘటన ఎందుకు తనని అంత కదిలించివేయడం? ఏమిటో, ఈ బంధా లకి అర్థమేమైనా వుందా? పాలిపోయిన బుగ్గలతో, సరిగ్గా శ్వాస ఆడక, ఎంతో ఆయాసంతో, యల్లయ్య కూతురు మంచంమీద పడుకొనివుంది. కోలమొహం, పల్చని పెది మలు. ఎండిపోతున్న ఆ పెదిమల్ని, సన్నని ఎర్రని నాలుకతో తడుపుకుంటో వుంది. ముంగురులు, నొసటిపైన, నీరసంగా, చలనం లేకుండా పడివున్నాయి. కాగా సుపరిచితమైన మొహం. తాను ఏ జన్మలో, ఆ మొహాన్ని తనదిగా గుర్తిం చాడో? ఎన్ని జన్మలు తపస్సుచేసి, ఆ మొహాన్ని తన స్వంతం చేసుకున్నాడో? ఆ సాంగత్యం, ఆ సన్నిహితత్వం

ఎన్ని జన్మల తపః ఫలితమో ? లేకపోతే, నిన్న కాక మొన్న కొత్తగా ఉద్యోగంలో చేరిన తనేమిటి, మాటవరుసకైనా అడుగండే, యల్లయ్యకి ఆ పాతిక రూపాయలు ఇవ్వడమేమిటి ? కాగా తాను సరిగ్గా రెండు రోజుల క్రితమే యల్లయ్యని మొదటిమాటు చూడడం—అప్పుడే అతనిపైన తనకు అంత గురి కలగడం ఏమిటి ? అమాంతంగా అంత సానుభూతి పుట్టుకు రావడం ఏమిటి ? అది ఏదో దైవికమని అనుకున్నాడు రామనాథం.

ఆ సంఘటన తరువాత రామనాథం ఏమాత్రం పని చేయలేకపోయాడు. ఎక్కడి ఫైళ్ళు అక్కడ కట్టివేసి, కుర్చీ లోంచి లేచాడు. బలంగా దెబ్బతిన్న హృదయం, చంచలంగా మారింది — "ఎక్కడికైనా వెళ్ళాలి. ఏమైనా చేయాలి" అని మనస్సు ఆరాటపడింది. వెంటనే హెడ్ క్లార్కు దగ్గరికి బయల్దేరాడు రామనాథం. అతను వెళ్ళడంతోనే హెడ్ క్లార్కు గౌరవంగా లేచి నిలబడ్డాడు. తన ఫ్యాన్ లేని సంగతి చెప్పాడు రామనాథం అతనితో — "ఇంతమాత్రానికి మీరు స్వయంగా దయచెయ్యాలా ! చిన్న చీటీ పంపిస్తే ఇంకొక ఫ్యాన్‌ని ఏర్పాటు చేయకపోయానా ?" అన్నాడు హెడ్ క్లార్కు. తను చేసిన పొరపాటు అర్థమై ఇంక అట్టే ఆఫీసులో వుంటే ఇంకా ఎన్ని పొరపాట్లు చేస్తానో, ఏమో అని భయం వేసి, ఒంట్లో బాగాలేదనే నెపంతో పై అధికారిని అడిగి, ఇంటికి బయల్దేరి వెళ్ళాడు. హోటల్‌లోని అతని గది, రామనాథాన్ని చూసి బావురుమన్నది. బట్టలైనా విప్పకుండా రామనాథం తన మంచంపైన కుప్పగా కూలిపోయాడు. ఏమీ తోచక కళ్ళు మూసుకున్నాడు. వెంటనే ఆసుపత్రిలోని గది,

కోల మొహం ప్రత్యక్షమైనాయి. ఎంత చెరిపివేసినా, ఆ మొహం చెరగలేదు, అతని కళ్ళల్లోంచి. ఆ రోజంతా అతన్ని పట్టి బాధించింది, పీడించింది.

మామూలుగా మరునాడు రామనాథం ఆఫీసుకు వెళ్ళాడు. తిరిగి ఏమీ తోచలేదు. అతన్ని కోల మొహం వెన్నాడుతూనేవుంది. ఉద్యోగంలో చేరి ఇంకా మూడురోజులైనా కాలేదు. అప్పుడే ఒకరోజు పై అధికారిని అడిగివెళ్ళాడు. పైగా సెలవు పెట్టడానికి వీలు లేదు. తిరిగి అడిగి, ఇంటికి వెళ్ళడం ఎంతమాత్రం బాగుండదు. విధిలేక ఫైళ్ళు ముందర వేసుకున్నాడు. ఫైళ్ళలోకూడా కోల మొహం కనపడటం మొదలెట్టింది. చెప్పకుండా ఆఫీసునించి వెళ్ళిపోతే మరుసటి రోజున తలనొప్పి వచ్చిందని, బొంకినా బొంకవచ్చు. కాని తీరా వెళ్ళిపోతే, యల్లయ్య ఏదైనా కబురు తీసుకువస్తే అది తనకు అందదు. అందుకని యల్లయ్యకోసం నిరీక్షించడమే మంచిదని అనుకున్నాడు రామనాథం. ఒక ఫైలు తెరిచి కేసు స్టడీ చేయడం ఆరంభించాడు. అతను చదివిన పేరాగ్రాఫ్ చదవడం మొదలెట్టాడు. ఎంతకీ కేసు అర్థం కాలేదు. తల గిర్రున తిరుగుతున్నది. మెకానికల్‌గా టీకోసం బెల్ నొక్కాడు. కొత్త ప్యూన్ లోపలికి వచ్చే లోపుగా సిగరెట్టు ముట్టించాడు. అతను గదిలోకి రావడంతోనే, "ఒక కప్పు టీ పట్రా" అని, ఒక రూపాయి తీసి టేబుల్ మీద పెట్టాడు. కొత్త ప్యూన్ రూపాయి తీసుకొని, టీ కోసం వెళ్ళిపోయాడు.

ఇంతలోనే జేవురించిన మొహంతో, యల్లయ్య గదిలో నెమ్మదిగా ప్రవేశించాడు. కళ్ళ వెంబడి ఏకధారగా కన్నీరు కారుతున్నది. అతని మొహం చూడడంతోనే, ఏదో పుట్టి మునిగి

నట్టు తోచింది రామనాథానికి. ఆతురతగా "మీ అమ్మాయికి ఎల్లావుంది" అని అడిగాడు. "ఇంకెక్కడి అమ్మాయి" అని యల్లయ్య వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. ఎందుకో రామనాథానికి పట్టరాని కోపం వచ్చింది. "ఛీ మూర్ఖుడా. ఒక్కగాను ఒక్క అమ్మాయిని దక్కించుకోలేక పోయావు. వెళ్ళు, నా కళ్ళముందునించి తక్షణం వెళ్ళిపో" అని శరీరం అంతా కంపిస్తో, గట్టిగా గర్జించాడు. అయినా యల్లయ్య అక్కడినించి కదల్లేదు. "వెడతావా లేదా, లేక ప్యూన్‌తో గెంటించనా ?" అని రామనాథం బలంకొద్దీ అరిచే సరికి, యల్లయ్య ఇంగితం గుర్తించి, అక్కడినుంచి కళ్ళు తుడ్చుకుంటూ బయటపడ్డాడు. అప్పటికే, గది వెలుపల ఎంతో మంది చప్రాసీలు పోగైనారు. "ఏమి జరిగిందని" వాళ్ళు ఏక కంఠంతో అడుగుతున్న ప్రశ్న వినిపించుకోకుండా యల్లయ్య ఆఫీసులోంచి బయటపడ్డాడు. కొందరు చప్రాసీలు అతనిని అనుసరించడం చూసి, వాళ్ళకి అందకుండా గబగబా అడుగులు వేశాడు.

యల్లయ్య వెళ్ళిపోవడంతో, రామనాథానికి ప్రపంచమంతా అంతరించింది. కళ్ళ ముందునుంచి ఒక దివ్య స్వప్నం దిగజారి పోయింది. తన శరీరంలోని ఒక భాగాన్ని తను చేతులారా చంపుకున్నట్లు తోచింది. తన రక్తంలోని కొంత రక్తాన్ని కోల్పోయినట్లు తోచింది. శరీరం నీరసించింది. బడలికతో ముచ్చెమటలు పోశాయి. కళ్ళల్లో ఏదో అంధకారం ఆవరించింది. రామనాథం రెండు చేతులతో కళ్ళు మూసుకొని ఆయాసంతో తన తల టేబుల్‌పైన పెట్టి, కళ్ళమీంద నించి చేతులు పక్కకు తొలిగించి, మూతలు పడ్డ కళ్ళతో

విశ్రమించడానికి ప్రయత్నించాడు. ఇంతలోనే కొత్త ప్యూన్ టీ తీసుకొచ్చి, రామనాథం టేబుల్‌పైన తలవాల్చి పడుకోవడం చూచి, కొంచం సేపు దగ్గు దగ్గాడు. అక్కడికీ రామనాథం తల ఎత్తకపోవడం గమనించి, "టీ తెచ్చాను సార్"అన్నాడు. ఆ హెచ్చరికకు రామనాథం కొంత తేరుకొని, తల ఎత్తాడు. జేబులోంచి కర్‌చీఫ్ తీసి, చెమటతో తడిసిన తన మొహాన్ని తుడ్చుకున్నాడు. ప్యూన్ కప్పులో టీ కలుపుతూ వుండగా, తన దీనావస్థకి ఏదో కారణం చెప్పడం అవసరమని రామనాథానికి తోచింది. "పాపం, యల్లయ్య కూతురు చనిపోయిందట" అన్నాడు ఏమీతోచక.

"మొహం చిట్లించి 'యల్లయ్య కూతురు' అని ఒక మాటు నోట్లోనోట్లో గొణుక్కొని, "ఏ యల్లయ్య కూతురు సార్ ?"అని అడిగాడు అతను సంగతి సందర్భాలు అర్థంగాక.

"మన ఆఫీసులో ఇంకే యల్లయ్య ఉన్నాడు? మన ప్యూన్ యల్లయ్య" అని జవాబు చెప్పాడు రామనాథం.

"యల్లయ్య కూతురా సార్" అని తిరిగి అడిగాడు ఆ ప్యూన్ రామనాథాన్ని. ఆ దుర్వార్తని నమ్మలేకపోతున్నట్లు అతని కంఠం ధ్వనించడం రామనాథం గమనించక పోలేదు.

"మొన్న ఈ పాటికి కులాసాగా వున్న అమ్మాయి, మంచం పట్టి, మూడు రోజుల్లో చనిపోయిందని చెబితే ఎవరైనా నమ్మడం కష్టమే" అన్నాడు రామనాథం, కొత్త ప్యూన్‌కి విశ్వాసాన్ని పురికొల్పుతూ.

"యల్లయ్య కూతురేమిటి? చనిపోవడమేమిటి సార్?" అని అన్నాడు ప్యూన్, ఆశ్చర్యం ఉట్టిపడుతున్న కంఠంతో.

"నిజమే ఆ దుర్వార్తని మొదట నేనూ నమ్మలేక పోయాను. కాగా ఎందుకో నాకు పట్టరానికోపం వచ్చింది. ఉన్న ఒక్క కూతుర్ని చేతులారా చంపుకున్నావని యల్లయ్యపైన ధుమ ధుమ లాడాను" అన్నాడు రామనాథం. తను యల్లయ్యని కోప్పడడం ఎవరైనా వినివుంటారేమోననే అనుమానంకొద్దీ.

'అది కాదుసార్, యల్లయ్యకు కూతుళ్ళుగాని, కొడుకులుగాని ఎవ్వరూలేరు సార్' అన్నాడు కొత్త ప్యూన్ కుండ బద్దలు కొడుతూ.

"ఏమిటీ యల్లయ్యకి ఈడువచ్చిన కూతురు లేదా?" అని అడిగాడు రామనాథం ప్యూన్ మాటల్ని నమ్మలేక.

"ఈడువచ్చిన కూతురు కాదుగదా, అతనికి చివరికి ఒక్క నలుసైనా లేదు సార్" అన్నాడు ప్యూన్ ప్రతిమాటని బల్లగుద్ది చెప్పినట్లు పలుకుతూ.

"తనకు ఒక ఈడువచ్చిన కూతురు వుందనీ, ఆ అమ్మాయికి డిఫ్థీరియా వచ్చిందనీ, ఐసొలేషన్ ఆసుపత్రిలో చేర్చామనీ, ఆ అమ్మాయి చివరికి చనిపోయిందనీ, అతను చెప్పిన మాటలన్నీ అబద్ధమన్నమాట" అన్నాడు రామనాథం పైకి ఆలోచిస్తున్నట్లుగా. తనని మోసంచేసి యల్లయ్య డబ్బు తీసికెళ్ళిన సంగతి మాత్రం ఎందుకో చెప్పలేకపోయాడు రామనాథం ఆ ప్యూన్‌తో.

"వాడు పచ్చిదొంగ. రోజూ ఆఫీసుకు ఆలస్యంగావచ్చి ఏవో కథలల్లి, మనల్ని మోసగిస్తాడు. ఎందరినో బంధువుల్ని చంపుకుంటాడు, సెలవుకోసం ప్రాధేయపడుతాడు, అప్పులకోసం వేధిస్తాడు, పైగా ఎప్పుడో హెడ్‌క్లార్కు కూతురికి

వచ్చినజబ్బు, లేని తన కూతురికి వచ్చినట్లు చెప్పి, ఎంత మోసం చేశాడు సార్'' అన్నాడు ప్యూన్, సంగతి సందర్భాలు వివరిస్తూ.

''ఇదే జబ్బు హెడ్ క్లార్కు కూతురికి వచ్చిందా?'' అని అడిగాడు రామనాథం ఆతురతగా.

''అవును సార్, ఒక్కగాను ఒక్క కూతురు, ఈడు వచ్చింది. ఆరునెల్ల క్రితం ఈ జబ్బుతోనే చనిపోయింది సార్'' అన్నాడు ప్యూన్ క్లుప్తంగా. రామనాథానికి ఎందుకో చేదు మింగినట్లు అయింది. డిఫ్థీరియాకీ, జబ్బుపడి చనిపోయిన హెడ్ క్లార్కు కూతురికీ, తనకీ, ఏదో సంబంధం ఉన్నట్లు తోచింది. కాని ఆ అమ్మాయి ఆరునెల్ల క్రితం జబ్బుపడి చని పోవడం మాత్రం, ఆ యువ హృదయం సహించలేకపోయింది.

''ఇంక నువ్వు వెళ్ళు. నీ పని చూసుకో'' అంతవరకు ఆప్యాయతని కనపరచిన రామనాథం కంఠం, ఈసారి కొంచెం కరుకుగా ధ్వనించింది.

ప్యూన్ వెళ్ళిపోవడంతోనే రామనాథం, కప్పు అందు కొని, టీ చప్పరించాడు. టీ చల్లారింది. టీకి మల్లేనే, అతని ఉద్రేకోద్వేగాలు చల్లబడ్డాయి. ఏ ఆలోచనలు లేకుండా, కొంచెంసేపు, కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఉండిపోయాడు. ఆ తరువాత తేరుకొని ఒక కాగితం తీసి, ఆ ఇద్దరి ప్యూన్లని తొలగించి, తన దగ్గర ఒక కొత్త ప్యూన్ని నియమించ వలసిందని అడుగుతూ హెడ్ క్లార్కుకి ఒక చీటీ వ్రాసి పంపించాడు.

అబద్ధాలు చెప్పి మోసగించడంవల్ల యల్లయ్యనీ, యల్లయ్య పైన నేరాలు చెప్పడంవల్ల ఆ కొత్త ప్యూన్

మల్లయ్యనీ రామనాథం తొలగించి ఉంటాడని అందరూ ఆఫీసులో అనుకున్నారు.

కాని, తనకు లేని కూతురు డిఫ్థీరియాతో చనిపోయిందని యల్లయ్య చెప్పడం, ఆరునెల్లక్రితం అదే జబ్బుతో హెడ్ క్లార్కు కూతురు చనిపోయిందని మల్లయ్య చెప్పడం, వారి తొలగింపుకి అసలు కారణాలని, నాటికీ నేటికీ ఆ ఆఫీసులో ఎవ్వరికీ తెలియదు.

ఒక దాని తర్వాత ఇంకొకటి చొప్పున పిడుగువంటి రెండు దుర్వార్తలు పడ్డప్పటికీ, ఆ యువ హృదయం, చివరకి అస్తిత్వంతో కూడా నిమిత్తం లేకుండా, తాను తన మనో వీథిలో సృష్టించుకున్న, ఆ కోల మొహాన్ని, ఆ పల్చని పెదిమల్ని, ఆ సన్నని ఎర్రటి నాలుకనీ, నొసటి పైన చలనం లేకండా పడి వున్న ఆ ముంగురులనీ మరిచిపోలేక పోయింది. కాగా, రామనాథాన్ని ఆ కోల మొహం ... ఆ పల్చని పెదిమలూ ... ఆ ఎర్రని నాలుక ... నొసటి పైన చిందులాడ లేని ఆ ముంగురులూ ... నేటికి వెన్నాడుతూనే ఉన్నాయి.

★